సమస్యల వలయంలో సర్కారు వైద్యం

- వైద్యం అందక ప్రజలు విలవిల
- వైఎస్సార్ సీపీ హయాంలో ఆసుపత్రుల అభివృద్ధి
- నేడు నిర్లక్ష్యం


నరసాపురం : వైఎస్సార్ సీపీ హయాంలో పట్టణంలో రూ.13 కోట్లతో నిర్మించిన ఏరియా ఆసుపత్రి


నరసాపురం : తూర్పుతాళ్లు పీహెచ్‌సీలో వైద్యం కోసం ఎదురుచూస్తున్న రోగులు


పెనుగొండ : 30 పడకల ఆసుపత్రి మధ్యలో పెరిగిన పిచ్చి మొక్కలు

నరసాపురం: నరసాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్యం సమస్యలతో సతమతమవుతోంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు రోగమొస్తే అప్పుచేసి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. సముద్రతీర ప్రాంత 17 గ్రామాల ప్రజలు సర్కారు వైద్యం సవ్యంగా అందక, ప్రైవేట్ ఆసుత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేక ఆర్ఎంపీలను ఆశ్రయించి, తాత్కాలిక వైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నియోజకవర్గానికి సంబంధించి నరసాపురంలో అధునాతన వసతులతో రూ.13 కోట్లతో కార్పొరేట్ తరహాలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 100 పడకల ఏరియా ఆసుపత్రిని నిర్మించింది. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించి వైద్యాన్ని మెరుగుపరిచింది. నేడు కూటమి ప్రభుత్వం ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించింది. ఈ ఆసుపత్రిలో కిడ్నీరోగుల కోసం డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చర్యలు తీసుకుంది. ఈ అంశాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

పీహెచ్‌సీల్లో సమస్యల తిష్ట

నరసాపురం పట్టణంలో రెండు పీహెచ్‌లు ఉన్నాయి. మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం, సిబ్బంది కొరత, అసౌకర్యాలు వేధిస్తున్నాయి. నరసాపురం మండలంలో తూర్పుతాళ్లు, ఎల్‌బీచర్ల పీహెచ్‌ల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. దాదాపు 40 గ్రామాల ప్రజలు ఏరోగం వచ్చినా ఈ రెండు పీహెచ్‌సీలే దిక్కు. ఎల్‌బీచర్ల పీహెచ్‌సీలో ఫార్మాసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్, అసిస్టెంట్ ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులు నెలల తరబడి ఖాళీ ఉన్నాయి. కనీసం వాచ్‌మెన్ పోస్టు కూడా భర్తీ చేయడంలేదు. ఈ పీహెచ్‌సీకి సొంత భవనం లేకపోవడంతో ఓ లేసు అల్లిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఆరుబయటే రోగులకు సేవలు అందిస్తున్నారు. తూర్పుతాళ్లు పీహెచ్‌సీలో కూడా ఇదే పరిస్థితి. సిబ్బంది కొరత, అసౌకర్యాలు వేధిస్తున్నాయి. మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరే వైద్యులు పనిచేస్తున్నారు. ఇక్కడ రాత్రిపూట పాములు వస్తున్నాయని రోగులు ఆందోళన చెందుతున్నారు.

ఆసుపత్రిలో అపారిశుద్ధ్యం

పెనుగొండ: చినుకు పడితే చాలు జారుడే, ఇది పెనుగొండ 30 పడకల ఆసుపత్రి దుస్థితి. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ ఆసుపత్రిని అభివృద్ధి చేసి ప్రారంభించారు. దీని చుట్టూ రహదారి నిర్మాణానికి వేసిన గ్రావెల్ గుట్టలు ఇంకా అలాగే దర్శనం ఇస్తున్నాయ. ఇటీవల కురిసిన వర్షంతో పూర్తిగా బురదమయంగా మారింది. అరకొర సిబ్బంది, నిధుల లేమితోనూ పారిశుద్ధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. లిక్విడ్స్, ఇతర పరికరాలు సరఫరా లేక నీళ్లతో ఆసుపత్రిలోపల తుడుస్తున్నారు. మరుగుదొడ్ల వద్దా ఇదే పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి మధ్యలో ఆహ్లాదకరమైన వాతావరణానికి ఏర్పాటు చేసిన గ్రీన్ లాన్ మొత్తం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది.

జీడీ సిబ్బంది కొరత

పెనుగొండ ప్రభుత్వాసుపత్రిలో జీడీ సిబ్బంది నియామకానికి ఉన్నతాధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. రోగులకు సేవలు అందించడం, మందులు సరఫరలోనూ ఇబ్బందులున్నాయి. ఆసుపత్రికి నేరుగా వచ్చే మందులు కాకుండా, ఇతర మందులు స్థానికంగా తీసుకొనే సౌలభ్యం ఉంది. అయితే, ఈ మందులు కోసం రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. స్థానికంగా మందులు సరఫరాలో ఇబ్బందులు తొలగించాలని రోగులు కోరుతున్నారు.

పోస్టుమార్టం సిబ్బంది ఎప్పటికో?

పెనుగొండ ఆసుపత్రిలో పోస్టుమార్టం సిబ్బందిని కేటాయించకపోవడంతో మృతదేహాలను తణుకు, పాలకొల్లు ఆసుపత్రిలకు తీసుకెళ్లాల్సి వస్తుంది. అక్కడకి వెళ్లాక గంటలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి బాధిత కుటుంబాలకు ఏర్పడుతుంది. ఆసుపత్రిలో పోస్టుమార్టం సదుపాయం త్వరగా కల్పించాలని వారు కోరుతున్నారు.

సమయానికి రాని వైద్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం 11 గంటలైనా వైద్యులు రాకపోవడంతో పేషెంట్లు ఇబ్బందులు పడ్డారు. డాక్టర్లు రాకపోయినప్పటికీ డాక్టర్ వచ్చారు పక్కకి వెళ్లారు.. వార్డుల్లో విజిట్‌కు వెళ్లారు.. ఇక్కడే ఉన్నారు వచ్చేస్తున్నారని చెబుతూ సిబ్బంది పేషెంట్ల సహనాన్ని పరీక్షిస్తున్నారు. జనరల్ మెడిసిన్ వైద్యులు ఆలస్యంగా రావడంతో పేషెంట్లు అధిక సంఖ్యలో నిరీక్షించాల్సి వచ్చింది. దంత వైద్యుడు 12 గంటల వరకు తన సీటులోకి రాలేదు. గైనకాలజీ చికిత్స చేసే వైద్యురాళ్లు ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో కలిపి ముగ్గురు ఉన్నారు. ఇందులో ఒక గైనకాలజీ డాక్టర్ మెటర్నరీ లీవ్‌లో ఉన్నారు. మరో వైద్యురాలు ఆమె కాలికి గాయం అవ్వడంతో చికిత్స కోసం ఓ ప్రైవేటు వైద్యుని వద్దకు వెళ్లినట్టు తెలిసింది. ఆమె ఉదయం 11.30 గంటలైనా ఆమె విధుల్లోకి రాలేదు. దీంతో గర్భిణులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కాసేపటికి ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధురి గర్భిణులు, బాలింతలకు వైద్య చికిత్స అందించారు. ఆసుపత్రిలో ఒక్క టాయిలెట్ మాత్రమే ఉండడంతో పేషెంట్లు చాలా ఇబ్బందులు పడ్డారు. కుక్క కాటుతో వైద్యానికి వచ్చిన ఓ వ్యక్తిని వ్యాక్సిన్ రూములో ఉన్న ఓ నర్స్ పలాన వార్డుకు వెళ్లి బరువు చూసుకునిరా అని చెప్పారు. అక్కడకు వెళ్లి అడిగితే ఇక్కడ కాదని అన్నారు. వ్యాక్సిన్ రూము వద్దకు వెళ్లి ఆ సిబ్బందిని ప్రశ్నించగా ఆమె వచ్చి బరువు చూపించి వెళ్లింది. అనంతరం బాధితుడికి వ్యాక్సిన్ వేశారు.

అధ్వానంగా బాలింతల వార్డు

ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతల వార్డు సీలింగ్ ఊడి పడితే పరిస్థితి నెలకొంది. ఇక్కడ సుమారు 15 బెడ్‌లు ఉన్నాయి. సీలింగ్ ఫ్యాన్‌లు తిరగనా, మానా అన్నట్టు ఉన్నాయి. దీంతో పేషెంట్లు తమ ఇంటి వద్ద నుండే టేబుల్ ఫ్యాన్‌లు తెచ్చుకొంటున్నారు. ఆసుపత్రిలో ఏ చిన్న సమస్య ఉన్నా త్వరలో కొత్త ఆసుపత్రి ప్రారంభం అవుతుంది కదా అనే చెబుతున్నారే తప్ప ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలనే ప్రయత్నం చేయడంలేదని రోగులు ఆరోపిస్తున్నారు.

అబా యాప్‌తో ఓపీకి తంటాలు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అబా యాప్‌తో ఓపీ పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారు. పేషెంట్ ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, ఆ ఫోన్ ఓటీపీ నంబర్ నమోదు చేసి ఓపీ రాయాల్సి ఉంది. దీని వల్ల ఎక్కువ సమయం వృథా అవుతుండడంతో ఓపీ క్యూలైన్ జనంతో పెరిగిపోతుంది. రోజుకు సుమారు 300 నుంచి 400 మంది వరకు పేషెంట్లు ఉంటున్నారు. సోమవారం ఓపీ సంఖ్య 450 దాటుతున్నారని చెబుతున్నారు.


పెనుగొండ : చిందర వందరగా ఆసుపత్రి ప్రాంగణం


పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు ఆసుపత్రిలో ఓపీ కోసం క్యూ కట్టిన పేషెంట్లు


పాలకొల్లు సెంట్రల్: వైద్యురాలి కోసం వేచిఉన్న గర్భిణులు


పాలకొల్లు సెంట్రల్: ఉదయం11.30 గంటలైన సీటులో లేని గైనకాలజీ, తిరుగుతూనే ఉన్న ఫ్యాన్

క్లుప్తంగా

సోమేశ్వరస్వామికి అభిషేకం


యలమంచిలి ఉమా సోమేశ్వరస్వామి

యలమంచిలి: శ్రావణ శుద్ధ విదియ సందర్భంగా స్థానిక ఉమా సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శివలింగానికి పంచామృతాభిషేకం చేశారు. అర్చకులు యలమంచిలి నరేంద్రశర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి కుంకుమపూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు దేవేరులను దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాద వితరణ చేశారు.

సొసైటీ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సొసైటీ త్రిసభ్య కమిటీ

పెనుగొండ: వడలి శ్రీఅగస్త్యేశ్వర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ త్రిసభ్య కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా కట్టా వెంకట రామకృష్ణ, పర్సన్స్‌గా యర్రంశెట్టి గోపాల మధు సూదనరావు, పిల్లి శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. ఆచంట జెడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, పితాని వెంకట్, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 31 అర్జీలు


సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 31 అర్జీలు అందాయని ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఫిర్యాదుదారుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఎలాంటి జాప్యంలేకుండా పరిష్కరించేందుకు కృషిస్తున్నట్టు ఆయన చెప్పారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: మండలంలో అరట్లకట్ట గ్రామంలో పేకాట శిబిరంపై నిర్వహించిన దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని రూ.21,200 స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్సై బి సురేంద్ర కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

పెనుగొండ ఏఎంసీ ప్రమాణ స్వీకారం


కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

పెనుగొండ: పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి నిర్వహించారు. చైర్మన్‌గా రామన్న పాలేనికి చెందిన బడేటి వీర బ్రహ్మం (బ్రహ్మజీ), వైస్ చైర్మన్‌గా శీలం బాబీ భాస్కర్, డైరెక్టర్లుగా మరో 15 మంది ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి బి.శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి


వెంకటశేషసాయిని సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల ఎదుగుదలకు వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమైనదని, స్నేహభావం, మంచి వాక్చాతుర్యం పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల వెంకటశేషసాయి అన్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట శేషసాయి మాట్లాడుతూ విద్యా రంగాన్ని ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు తీవ్రంగా బాధిస్తున్నాయని, వాటి నుంచి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడారు. అనంతరం రిటైర్డ్ న్యాయమూర్తి వెంకటశేషసాయిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆల్బెండజోల్’తో రక్తహీనత నివారణ


ఆల్బెండజోల్ మాత్రలపై పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ నవ్య జీవన్

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వల్ల రక్తహీనత నుంచి బయటపడవచ్చని డాక్టర్ ఎం నవ్యజీవన్ అన్నారు. సోమవారం లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నులి పురుగులు నివారణపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నవ్యజీవన్ మాట్లాడారు. ఈ నెల 12న హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రైవేటు పాఠసాలల్లో జాతీయ నులిపురుగులు నివారణ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్టు తెలిపారు. 22వ తేదీన కూడా మాత్రలు వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎలిజిబెత్, ఎస్‌కే అమలేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుతో మోహన్‌యాదవ్

పెనుగొండ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని ఆ పార్టీ అనుబంధ విభాగాల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన యాదవ్ తెలిపారు సోమావారం ఆయన తాడేపల్లిగూడెంలో ఆచంట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజును కలిసి పార్టీ పటిష్టతపై చర్చించారు. హామీలు అమలు చేయకపోవడంతో కూటమి పాలనపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత వ్యక్తం అవుతుందన్నారు. మూడు నెలలు కాలంలో కూటమి ప్రభుత్వం రూ.37 వేల కోట్లు అప్పు చేసిందని తెలిపారు. దేశంలో అప్పులు చేయడంలో కూటమి ప్రభుత్వం నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. సంక్షేమంలో వెనుకంజ వేసిందని వివరించారు. ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, పోరుబాట పట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

క్షీరారామంలో సప్త ప్రదక్షిణ


సప్త ప్రదక్షిణలో పాల్గొన్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్తప్రదక్షిణల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాలంలో ప్రదక్షిణలు మొదలుపెట్టారు. సుమారు మూడు వేల మంది భక్తులు ప్రదక్షిణల్లో పాల్గొన్న అనంతరం స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. రాత్రి 7.30 గంటలకు స్వామివారికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత ప్రత్యేక తరగతులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచే మెరుగైన విద్యను అందించేందుకు ఉచిత ప్రైవేటు తరగతులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. సోమవారం భీమవరం పట్టణం దుర్గాపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో వసుధ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన విద్యా సౌజన్యం లెర్నింగ్ సెంటర్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల ముగిసిన అనంతరం ఒక గంట పాటు ప్రత్యేక టీచర్ల ద్వారా పాఠాలను చదివించడం, హోమ్ వర్క్ చేయించడం, కొత్త విషయాలను నేర్పించడం అదనపు తరగతుల ప్రత్యేకత అన్నారు. రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను నిర్వహించేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ చెప్పారు. వసుధ ఫౌండేషన్ అందించిన నోటు పుస్తకాలను విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో డీఈఓ ఇ నారాయణ, సమగ్ర విద్య ఏపీసీ పి.శ్యాంసుందర్, పాఠశాల హెచ్ఎం ఆర్ రాంభద్రరావు, ఏఎంఓ సీహెచ్ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, మానవత ప్రతినిధి వెంకటపతిరాజు పాల్గొన్నారు.

బస్సుల్లో పురుషులకు సీట్లు కేటాయించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆగస్టు పదిహేను నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందున బస్సులు అన్నీ లేడీస్‌తో నిండిపోయే అవకాశం ఉన్నందున, ప్రతి బస్సులోనూ మగవారికి ప్రత్యేక సీట్లు కేటాయించాలని ఏపీ స్టేట్ కన్స్యూమర్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఏఆర్‌కే హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీఎంకు, ట్రాన్స్‌పోర్ట్ మినిస్టర్, వెలగపూడి కార్యాలయానికి వినతులు పంపారు.

యూరియాను అందించలేని ప్రభుత్వమిది


నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏడాదిగా రైతులకు ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదని, వ్యవసాయం దండగ అన్నట్లుగానే పాలన సాగిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య ధ్వజమెత్తారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సరిపడే యూరియా ఎరువుల్ని కూడా అందుబాటులోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. సొసైటీలకు మొక్కుబడిగా యూరియాను సరఫరా చేసి, మైళ్ల దూరం వెళ్లి రైతుల్ని తెచ్చుకోమనడం దారుణమన్నారు. సొసైటీలకు సరఫరా చేసిన యూరియా బడా రైతులు, కూటమి రైతులకే వెళ్లుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయన్నారు. కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. బ్లాక్ మార్కెట్ లేకుండా ఆర్ఎస్కేల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయాలని సీతారామయ్య డిమాండ్ చేశారు. జగనన్న పథకాల పేర్లు మార్చి మొక్కుబడిగా అమలుజేస్తున్న కూటమి ప్రభుత్వం కొత్త పథకం ఒక్కటీ అమలుజేయలేదని ఆరోపించారు. అన్నదాతల పట్ల రాజకీయం తగదని సీతారామయ్య హెచ్చరించారు.

గోతులమయంగా రాష్ట్రీయ రహదారి


వినాయకుని గుడి వద్ద గోతుల్లో ఇబ్బంది పడుతున్న వాహనదారులు


సచివాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

కాళ్ల: జువ్వలపాలెం రాష్ట్రీయ రహదారి గోతులమయంగా మారింది. చిన్నపాటి వర్షాలకే తాత్కాలిక మరమ్మతులు కొట్టుకుపోయి అధ్వానంగా తయారైంది. ప్రధానంగా పెదఅమీరం నుంచి కోపల్లె, జక్కరం, సీసలి, కాళ్ళకూరు, గ్రామాల పరిధిలో రాష్ట్రీయ రహదారి గోతులమయంగా మారింది. జక్కరం గ్రామంలో వినాయకుడి ఆలయం వద్ద, సచివాలయం వద్ద గోతులు ఏర్పడి వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికి వర్షపు నీరు నిలిచిపోవడంతో గోతులు కనబడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

‘ట్రంప్’ సుంకాలపై మోదీ మౌనం వీడాలి

తణుకు అర్బన్: భారతదేశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధిస్తే దేశ ప్రధాని మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని, మౌనం వీడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు రోటరీ క్లబ్ హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశంపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని, ట్రంప్ విధిస్తున్న సుంకాల వలన రాష్ట్రంలో ఆక్వా రైతులపై పెనుభారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.